సాక్షి
జోగుళాంబ గద్వాల
బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



మార్పే లక్ష్యం..
విద్యార్థుల్లో మార్పే ముఖ్యమనే లక్ష్యంతో 'ఎక్స్‌ఫో' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

వివరాలు 8లో ▸



16వ స్థానంలోకి..
ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచుతూ జిల్లా స్థానం మెరుగుపరిచారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
29.9 /22.4

వాతావరణం
ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



గద్వాల: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని ఆ సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని ఎమ్మార్సీ భవనాల ఎదుట నిరసన వ్యక్తం చేసి, సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాలకు వినతి పత్రాలు ఇచ్చి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్‌ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓ చంద్రకళకు వినతి అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు గోపాల్, శ్రీనివాసులు, జనార్దన్, ఖాజా, సమి, శేషన్న, రామాంజనేయులు, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ద్వారా మెరుగైన సేవలు: ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బస్టాండ్ ప్రాంగణంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళా ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన లక్కీ డ్రా కార్యక్రమాన్ని జిల్లా మహిళా అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఆర్‌ఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం అనేక రాయితీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మెరుగైన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాఖీ పండుగ సందర్భంగా గతనెల 30, 31 మహిళా ప్రయాణికుల కోసం లక్కీడ్రా బాక్స్ నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు తాము ప్రయాణించిన టికెట్లపై పేరు, మొబైల్ నంబర్ రాసి బాక్స్‌ల్లో వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. రీజియన్‌లో ఎం.వెంకటమ్మ (పర్సాపూర్, కొడంగల్), ఎం.కవిత (నారాయణపేట), ఖైరున్నిసా తృతీయ (వనపర్తి) గెలుపొందినట్లు తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.25 వేలు, ద్వితీయ రూ.15, తృతీయ రూ.10వేల నగదు బహుమతులను ఈనెల 8న హైదరాబాద్‌లోని ఎంజీ బస్టాండ్‌లో అందజేస్తారని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా టీచర్ గాయత్రిని సన్మానం చేశారు. కార్యక్రమంలో సెరికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ లత, డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ కవిత, ఫిషరీస్‌శాఖ ఏడీ రాధా రోహిణి, ఆరోగ్యశ్రీ డీసీ స్వప్న, డీటీఓ ధానాజీ, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు బాబునాయక్, శ్యామల, డిపో మేనేజర్ సుజాత, పారిజాత, మానస తదితరులు పాల్గొన్నారు.



తప్పటడుగులు..



వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ(ఫైల్)



- మైనర్ల చేతికి బైక్‌లు
- ఇష్టారాజ్యంగా డ్రైవింగ్
- అడ్డుకట్ట వేయలేని కుటుంబ సభ్యులు
- పోలీసుల తనిఖీలో పట్టుబడుతున్న వైనం

గద్వాల క్రైం: వింత పోకడలు ఎక్కువైపోయాయి. సరదా వ్యసనాలపై మోజు పడుతూ రోడ్డుపై బైక్‌లను ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. పిల్లలపై నిఘా పెట్టకపోవడంతో పలువురు మైనర్లు మద్యానికి అలవాటు పడుతూ వారి జీవితాన్ని చేజేతులా అంధకారంలోకి నెట్టుకుంటున్నారు. జిల్లాలోని మైనర్ల చేతిలో బైక్ ఉంటే.. వారి స్పీడ్‌కు కళ్లెం వేయలేని దుస్థితి ఏర్పడింది. ఇదే వారి జీవితంలో రాంగ్ రూట్‌గా మారింది. చెడు వ్యసనాలకు అలవాటు పడి కటకటాలపాలైన సంఘటనలు ఉన్నాయి.

వక్రమార్గంలో వెళ్లకుండా..

■ స్నేహితుల్లో ఎవరిదైనా పుట్టిన రోజు ఉంటే చాలు పట్టణ శివారు ప్రాంతాల్లో అర్ధరాత్రి 12 గంటలు దాటగానే నడిరోడ్డుపైకి వచ్చి కేక్ కట్ చేసి హంగామా చేస్తున్నారు. మద్యం దుకాణాల వద్ద చిన్నారులకు మద్యం విక్రయించబోమనే నిబంధన ఉన్నా.. అమలు కావడం లేదు. రాత్రి సమయంలో పోలీసుల పెట్రోలింగ్ సమయంలో పోలీసులకు దొరికిన సంఘటనలు ఉన్నాయి. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం పోలీసులకు పరిపాటిగా మారింది. తల్లిదండ్రులు ఇప్పటికైనా మేల్కొని తమ పిల్లలపై నిఘా పెట్టి వక్రమార్గంలో వెళ్లకుండా చూసుకోవాలి.

■ ఇళ్లలో చొరబడి విలువైన వస్తువులు, సామగ్రి చోరీ చేయడం వాటిని తక్కువ ధరకు మార్కెట్లో విక్రయించి వచ్చిన నగదుతో మద్యం, పొగాకు, పాన్‌మసాల, జర్ధ తదితర వాటిని తీసుకుంటున్నారు.

పరోక్షంగా ప్రోత్సాహం..

చాలా మంది తల్లిదండ్రులు పిల్లలకు బైక్ నేర్పిస్తుంటారు. అయితే వారి చేతికి బైక్ ఇవ్వడం తప్పని తెలిసినా.. ఏదైనా పని ఉంటే ఆసరా అవుతారనే భావనతో తల్లిదండ్రులు పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. పిల్లలేమో సరదాగా ఇద్దరు, ముగ్గురు స్నేహితులను ఎక్కించుకుని బైక్‌లపై దూసుకెళ్తున్నారు. స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపుతప్పి కిందపడిన సంఘటనలు ఉన్నాయి. అయితే తల్లిదండ్రులు వారిని నిలువరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు.

■ ఆగస్టు 15న మైనర్లు రోడ్డుపై బైక్‌లతో చేసిన హంగామా అంతా ఇంత కాదు. వారిని నిలువరించే క్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐకి గాయాలయ్యాయి.

■ వ్యసనాలకు అలవాటు పడిన ముగ్గురు మైనర్లు డబ్బులు సంపాదించేందుకు అడ్డదారి తొక్కారు. చోరీల దారిని వెతుకున్నారు. నూతన నిర్మాణంలోని ఇళ్లలో కాపర్ వైర్, ఇనుప కడ్డీలను ఎత్తుకెళ్లి విక్రయిస్తున్న క్రమంలో పట్టుబడి కటకటాలపాలయ్యారు.

■ 17 ఏళ్ల బాలుడు ప్రేమ పేరిట పదో తరగతి చదువుతున్న విద్యార్థిని వేంధిపులకు గురిచేశాడు. బాలికను బయపెట్టి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి జువెనైల్ హోంకు తరలించారు. యుక్త వయస్సులోనే చెడు అలవాట్లకు గురవుతున్నారు. మరోవైపు నిత్యం రోడ్డుపై మైనర్లు బైక్‌లను పరిమితికి మించిన వేగం, శబ్ద కాలుష్యం, విన్యాసాలు, సినిమా తరహాలో బైక్ చేజింగ్‌లతో పోటీ పడుతున్నారు.

జిల్లా కేంద్రంలో పోలీసుల తనిఖీల్లో మైనర్లు బైక్ డ్రైవింగ్ చేస్తూ.. పట్టుబడుతున్నారు. ఈ ఏడాది 60కు పైగా కేసులు నమోదయ్యాయి. జరిమానా రూపంలో రూ.26 వేలు విధించారు.



మైనర్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ(ఫైల్)

పిల్లల ప్రవర్తనను గమనించాలి..



తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలి. వారు అడిగినన్ని డబ్బులు ఇవ్వకుండా స్వయంగా వారి అవసరాలను గుర్తించి వారే డబ్బులు చెల్లించాలి. వాహనాలు నడుపుతున్నారని తల్లిదండ్రులు మురిసిపోవడం కంటే వారు చేస్తుంది తప్పు అనే విషయాన్ని గుర్తించాలి. రోడ్డుపై వాహనాలు నడిపే క్రమంలో సామర్థ్యం ఉండదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. వినోదాలతో చేసే కార్యక్రమాలను నిలువరించాలి. డబ్బు విలువ తెలియజేయాలి. చెడు వ్యసనాలకు దారితీస్తున్న అంశాలను తెలుసుకుని సన్మార్గంలో నడిచేలా చర్యలు తీసుకోవాలి.

– వెంకటేశ్వర్లు, గద్వాల డీఎస్పీ

గురువుల స్ఫూర్తితో రాణించాలి



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, అడిషనల్ కలెక్టర్ అపూర్వ్ చౌహాన్

- జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల: గురువు లేకుండా ఏ ఒక్కరి ప్రతిభ వెలికి రాదని, వారి స్ఫూర్తితో ప్రతిఒక్కరూ రాణించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బాలభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, అడిషనల్ కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 49 మందిని ఘనంగా సన్మానించారు. అంతకు ముందు నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులనుద్దేశించి జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడారు. తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు జీవితాన్ని అందిస్తారన్నారు. సమాజంలో ఉపాధ్యాయులకు గౌరవ ప్రదమైన గుర్తింపు ఉందని, దానిని కాపాడేందుకు ప్రతి ఉపాధ్యాయుడు మరింత కృషి చేయాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ.. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దితేనే గుర్తింపు వస్తుందని అభిప్రాయపడ్డారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పాలని సూచించారు. తెలంగాణ ఉద్యమం, జిల్లా ఏర్పాటులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఆదే స్ఫూర్తితో జిల్లాలో అక్షరాస్యత పెంపునకు కృషి చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తుందన్నారు. అక్షరాస్యతలో వెనుకబడిన మన జిల్లాను మొదటి వరసలో నిలపాలని, అందుకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు నడుస్తున్నాయని వివరించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. గురుపూజా మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈఓ సిరాజుద్దీన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సరోజమ్మ, సర్పంచ్ జ్యోతి, విద్యాధికారులు ఇందిర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసులు

మల్దకల్: గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసులు బీఎల్‌ఓలకు సూచించారు. మంగళవారం మల్దకల్ మండల పరిషత్ సమావేశ హాలులో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు నమోదు చేసే ముందు, వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించిన అనంతరం నమోదు చేయాలన్నారు. అలాగే ఓటరు జాబితాలో పేరు ఉండి చనిపోయినట్లయితే వారి కుటుంబ సభ్యులతో వివరాలు తెలుసుకుని, వారి పేర్లు తొలగించాలన్నారు. కొత్తగా వివాహమైన వారి పేర్లు తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, ఆర్‌ఐలు నాగిరెడ్డి, రామకృష్ణ, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

గట్టు: మండల కేంద్రంలోని ఓటరు నమోదు కేంద్రాలను అదనపు కలెక్టర్ శ్రీనివాసులు ఆకస్మికంగా పరిశీలించారు. ప్రతి ఇంటికి తిరిగి కొత్త ఓటర్లను గుర్తించడంతో పాటు మరణించిన వారిని గుర్తించి, డెత్ సర్టిఫికెట్ తీసుకుని తొలగించాలన్నారు. మార్పు, చేర్పుల కోసం పోలింగ్ బూత్‌ల వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను సందర్శించారు. ఎక్కడైనా పోలింగ్ కేంద్రాలు మారితే ఆ విషయాన్ని ఓటర్లకు తెలియజేయాలన్నారు. వారి వెంట తహసీల్దార్ ధనుంజయ్, డీటీ రవికుమార్, శ్రీనివాసులు, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.



మల్దకల్‌లో ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసులు

ఆదిశిలా క్షేత్రంలో పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు జిల్లా అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావులు ఆలయ విశిష్టతలను వివరించారు. అనంతరం స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ప్రలోభ పెట్టే ప్రాంతాలను గుర్తించండి



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: జిల్లాలో ప్రలోభ పెట్టే ప్రాంతాలను గుర్తించి, పూర్తి వివరాలను సమర్పించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల్లో జిల్లాలోని ఏయే ప్రాంతాలు ఎక్కువగా డబ్బు, బంగారం, సిల్వర్, ఆభరణాలు, మద్యం వంటివి సరఫరా చేశారో ఆ ప్రాంతాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. 2014, 2018 ఎన్నికలకు సంబంధించి ఏమైన డబ్బు, మద్యం సీజ్, వాటి లొకేషన్లు, ఏదైన ఒక ఖాతా నుంచి ఎక్కువ సార్లు లావాదేవీలు జరిగినట్లయితే వాటికి సంబంధించి పూర్తి వివరాలను అందజేయాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ శాఖల అధికారులకు వివరించారు. సమావేశంలో ఎన్నికల నోడల్ పోలీస్ అధికారి అదనపు ఎస్పీ రవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, ఎల్‌డీఎం అయ్యప్ప రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

అనుమతులు మంజూరు చేయాలి

గద్వాల రూరల్: పరిశ్రమలకు సంబంధించిన అన్ని అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని అడిషనల్ కలెక్టర్ అపూర్వ్ చౌహాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ ఛాంబర్‌లో డీఐపీసీ, టీఎస్ ఐపాస్‌పై సమావేశం నిర్వహించి మాట్లాడారు. టి ప్రైడ్ పథకం(ఎస్సీ 11), పారిశ్రామికవేత్తలకు, ఎస్టీ 1 పారిశ్రామికవేత్తకు రాయితీలను మంజూరు చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ యాదగిరి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ బాబు, ఎల్‌డీఎం అయ్యప్ప రెడ్డి, ఆర్డీఓ పురుషోత్తం తదితరులు ఉన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచండి

అయిజ: పట్టణంలోని అన్ని వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్ పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా రేయిన్ కోర్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరయ్యాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. నిబంధనల మేరకు అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న, కమిషనర్ గోల్కొండ నర్సయ్య, ఏఈ గోపాల్, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

గద్వాల కాంగ్రెస్‌లో టికెట్ లొల్లి



మురళీధరన్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

- పాత, కొత్తవారంటూ పంచాయితీ

గద్వాల అర్బన్: గద్వాల కాంగ్రెస్‌లో నాయకుల మధ్య టికెట్ల పోరు తారాస్థాయికి చేరుతుంది. నేతల మధ్య వైరం రోజురోజుకు మరింత ముదురుతోంది. పాత, కొత్తవారి మధ్య పోరు కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే పలుమార్లు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేసుకోగా.. ముఖాముఖి సైతం ఒకరిపై మరొకరు బాహాటంగానే విమర్శలు, సవాళ్లు ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు. గ్రూపులుగా విడిపోయి కార్యక్రమాలను నిర్వహిస్తుండగా.. ఫ్లెక్సీలు చించివేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడం, మరోవైపు ప్రచారాలు చేసుకుంటున్నారు. ఇలా గద్వాల కాంగ్రెస్ పార్టీలో అంతా గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో క్యాడర్ ఎటువైపు ఉండాలో తెలియక అయోమయమవుతున్నారు. గద్వాల కాంగ్రెస్‌లో జరుగుతున్న తీరు పెద్ద ఎత్తున్న చర్చనీయాంశంగా మారుతుంది. కొత్తగా పార్టీలో చేరిన సరిత తిరుపతయ్యకు టికెట్ ఇవ్వకూడదని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కురువ విజయ్‌కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి, వీరుబాబులు మంగళవారం హైదరాబాద్‌లో ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ మెంబర్ మురళీధరన్‌కు ఫిర్యాదు చేశారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

శాంతినగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఆంగ్లం బోధించేందుకు గాను గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డా.అరుణాబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతరులు 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని, పీహెచ్‌డీ/నెట్/ సెట్ అర్హత కలిగిన వారికి పోస్టుల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 11 సోమవారం సాయంత్రం 4.30 గంటలలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 12న కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

హాట్‌టాపిక్‌గా 'యెన్నం' ఎపిసోడ్

- సస్పెన్షన్ తర్వాత ఘాటుగా స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి
- బీజేపీ నాయకులు, కార్యకర్తల్లో గందరగోళం
- ఆయన దారెటు అని మహబూబ్‌నగర్ శ్రేణుల్లో చర్చ
- కాంగ్రెస్ ఆశావహుల్లో మాత్రం గుబులు

కమలంలో కలకలం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: బీజేపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సస్పెన్స్.. ఆ తర్వాత ఆయన ఘాటు స్పందన ఉమ్మడి పాలమూరులో హాట్‌టాపిక్‌గా మారింది. ఆయన మాటలు పార్టీలో కాకరేపుతుండగా.. ఈ పరిస్థితులు ఎటు దారితీస్తాయోననే ఆందోళన కమలం శ్రేణుల్లో నెలకొంది. మరోవైపు తన దారెటు అనేది యెన్నం స్పష్టం చేయనప్పటికీ.. ఆయన వ్యవహరిస్తున్న తీరును బట్టి కాంగ్రెస్‌లో చేరుతారనే ఊహాగానాలు విన్పిస్తున్నాయి. ఈ అంశం మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న 'హస్తం' నేతలను కలవరపెడుతోంది.

'మునుగోడు' తర్వాత అంటీముట్టనట్టు..

బీజేపీలో కొద్దికాలంగా మారుతున్న పరిణామాలతో యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా నల్లగొండ జిల్లా మునుగోడు ఉపఎన్నికలు.. ఆ తర్వాత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు తదితర అంశాలపై కొన్నాళ్లుగా ఆయన కినుక వహించారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ కార్యక్రమాలకు సైతం ఆయన కొంత దూరంగానే ఉన్నారు. బీజేపీ జాతీయ, రాష్ట్రస్థాయి నేతల పర్యటనలకు కూడా రాకపోవడం అప్పట్లోనే చర్చనీయాంశంగా మారింది. మరోవైపు పార్టీకి చెందిన తన ముఖ్య అనుచరులు, కార్యకర్తలతో బీజేపీ అధిష్టానం స్టాండ్ మార్చిందంటూ సంకేతాలు ఇవ్వడమే కాకుండా పార్టీ మారితే ఎలా ఉంటుందనే అభిప్రాయాలను సేకరించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆదివారం ఆయన మహబూబ్‌నగర్‌తో పాటు హన్వాడకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో హన్వాడలో సమావేశమయ్యారు. త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరతానని, అందరూ తనకు మద్దతుగా నిలవాలని కోరినట్లు తెలిసింది. రహస్య భేటీపై సమాచారం తెలుసుకున్న పార్టీ పెద్దలు అదే రోజు రాత్రి యెన్నంను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

అటు ఆందోళన.. ఇటు గుబులు

మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో బీసీ వర్గానికి చెందిన నాయకుడు ఎన్పీ వెంకటేష్ ఏడాది క్రితం కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. ఇటీవల మళ్లీ ఆయన తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. యెన్నం సైతం త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో బీజేపీ శ్రేణులు ఆందోళన చెందుతుండగా.. ఇదే సమయంలో స్థానిక కాంగ్రెస్ నేతల్లో గుబులు మొదలైంది. యెన్నం అసెంబ్లీ టికెట్ ఆశించి కాంగ్రెస్‌లోకి వస్తుండడమే ఇందుకు కారణం. కాంగ్రెస్‌లో ఇప్పటికే ఈ సీటు కోసం సంజీవ్ ముదిరాజ్, ఒబేదుల్లా కొత్వాల్ తదితర నాయకుల మధ్య పోటాపోటీ నెలకొంది. తాజాగా మారుతున్న పరిణామాలు వారిని కలవరానికి గురిచేస్తున్నాయి. కాగా.. బీజేపీ నుంచి మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డికి మహబూబ్‌నగర్ అసెంబ్లీ టికెట్ ఖరారు కావడంతోనే యెన్నం రూట్ మార్చినట్లు సైతం రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

శ్రీనివాస్‌రెడ్డి నేపథ్యం..

రెవెన్యూ శాఖలో కొన్నాళ్లు ఉద్యోగం చేసిన యెన్నం శ్రీనివాస్ రెడ్డి 2002లో బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్)లో చేరారు. ఆ తర్వాత ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడితో పాటు వివిధ హోదాల్లో పనిచేశారు. 2009లో మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. 2012లో బీజేపీలో చేరి మహబూబ్‌నగర్‌కు జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఇబ్రహీంపై 1,859 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రస్తుత మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం 2015లో బీజేపీకి రాజీనామా చేసిన ఆయన 2016లో చెరుకు సుధాకర్‌తో కలిసి తెలంగాణ ఉద్యమ వేదికను స్థాపించారు. 2017లో తెలంగాణ ఇంటి పార్టీలో చేరి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2018లో మహాకూటమి పొత్తులో భాగంగా ఆయనకు మహబూబ్‌నగర్ టికెట్ రాలేదు. దీంతో 2019లో మళ్లీ బీజేపీలో చేరిన ఆయన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ క్రమంలో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొంటూ ఆయనపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది.

మాటలతో మంటలు..

సస్పెన్షన్ వేటు పడిన తర్వాత యెన్నం మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ అధిష్టానం తీరుపై మాటలు ఎక్కుపెట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని.. మునుగోడు ఎన్నికల్లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఓటమి బీజేపీ అధిష్టానం వ్యవహార శైలిని ఎత్తిచూపుతోందని విమర్శించారు. అంతేకాదు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను ఉద్యమకారులకు కాకుండా కిషన్‌రెడ్డికి అప్పగించడం దేనికి సూచన అంటూ విమర్శలు గుప్పించడం హాట్‌టాపిక్‌గా మారింది. యెన్నం మాటలపై జిల్లా బీజేపీలో భిన్నస్వరాలు వినిపిస్తున్నప్పటికీ.. ఆయన లేవనెత్తిన అంశాలు కరుడుగట్టిన ఆ పార్టీ అభిమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

క్లుప్తంగా

నీటిసంపులో పడి చిన్నారి మృతి

జడ్చర్ల: ఆడుకుంటూ వెళ్లి ఓ చిన్నారి నీటిసంపులో పడి మృతి చెందిన ఘటన మంగళవారం జడ్చర్ల పంచముఖి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో చోటుచేసుకుంది. సీఐ రమేష్‌బాబు కథనం ప్రకారం.. ఇంపీరియల్ గార్డెన్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం దగ్గర కొత్తగా ఇల్లు నిర్మాణం పనులు సాగుతున్నాయి. ఇంటికి దగ్గరలో సంచార జీవనం గడిపే భార్యాభర్తలు జమ్ములమ్మ, మల్లేష్‌లు తమ పిల్లలతో గుడిసెలో నివాసం ఉంటున్నారు. తల్లిదండ్రులు గుడిసెలో ఉండగా కూతురు హారిక(04) ఆడుకుంటూ నిర్మాణంలో ఉన్న ఇంటిదగ్గరకు వెళ్లి అక్కడున్న సంపులో కాలుజారి పడింది. ఎవరూ చూడకపోవడంతో చిన్నారి మృతి చెందింది. తర్వాత కూతురు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల వెతికారు. నీటి సంపులో తేలాడుతూ పాప కనిపించడంతో లబోదిబోమంటూ బోరున విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి..


శంకర్‌నాయక్ (ఫైల్)

పెబ్బేరు రూరల్: చేపల వేటకు వెళ్లి చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం వనపర్తి మండలంలోని పెద్దగూడెం తండాలో చోటు చేసుకుంది. వనపర్తి రూరల్ ఎస్‌ఐ నాగన్న కథనం ప్రకారం.. పెద్దగూడెం తండాకు చెందిన శంకర్ నాయక్(40) సోమవారం గ్రామ శివారులోని చెరువుకు చేపలవేటకు వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో భార్య చుట్టు పక్కల, తెలిసిన వారిని అడిగినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం చెరువు దగ్గర చూడగా ఒడ్డున శంకర్‌నాయక్ మృతదేహం కనిపించింది. అతనికి మూర్ఛ రావడంతో చెరువులో పడి మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. అతని భార్య జిమ్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో పడి మరొకరు..

బిజినేపల్లి: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని వట్టెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వట్టెం గ్రామానికి చెందిన ప్రసాద్ (55) సోమవారం సాయంత్రం పొలం పనులకు వెళ్లి సాయంత్రం చెరువుకట్ట మీదుగా తిరుగు ప్రయాణమయ్యాడు. ప్రమాదశావత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఈ విషయం తెలియక కుటుంబ సభ్యులు ఊరంతా గాలించారు. బంధువులకు ఫోన్ చేసినా అతని ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులు నీటిపై తేలాడుతున్న అతని మృతదేహం చూశారు. ఈ విషయం వారి కుటుంబ సభ్యులకు చెప్పడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని రోదించారు.




ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురు ఉపాధ్యాయులు సత్కారాలు అందుకున్నారు. మంగళవారంహైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగి కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీ, విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే వాణీదేవి చేతుల మీదుగా సన్మానించి, అవార్డులు అందజేశారు. సత్కారాలు అందుకున్న వారిలో వరుసగా.. డాక్టర్ ఎస్.చంద్రకిరణ్(అసోసియేట్ ప్రొఫెసర్, కెమెస్ట్రీ, పీయూ), అమీనా ముంతాజ్‌జాహన్ (బాటనీ లెక్చరర్, ఎన్‌టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్), డాక్టర్ కె.తిరుపతయ్య(అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎంవీఎస్‌కళాశాల, మహబూబ్‌నగర్), డాక్టర్ ఎం.మల్లారెడ్డి (అగ్రికల్చరల్ అసోసియేట్ డీన్, పాలెం), హేమచంద్రుడు(జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్ ఎదిర), శోభారాణి(ఎస్‌ఏ మ్యాథ్స్, జెడ్పీహెచ్‌ఎస్ బాలికల ఖిల్లాఘనపూర్), కె.శ్రీనివాసులు(ఎస్‌ఏ, అచ్చంపేట), లక్ష్మారావు(ఎస్‌ఏ మ్యాథ్స్, ఉప్పునుంతల), మునీంద్రమ్మ(ఎస్‌ఏ సోషల్, జెడ్పీహెచ్‌ఎస్ బాలికల, కొత్తకోట), వై.నాగరాజు(ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ గూడూరు, చిన్నచింతకుంట), పి.మురళీకృష్ణ, (ఎస్‌జీటీ ఎంపీయూపీఎస్, రామకృష్ణాపూర్, కొత్తకోట), ఎం.రమేష్‌లింగం (లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మల్దకల్).

మార్కులు కాదు.. మార్పే లక్ష్యం


ఎక్స్‌పో కార్యక్రమంలో అబాకస్ ద్వారా గణితం వివరిస్తున్న విద్యార్థులు

- ‘ఎక్స్‌పో’తో వినూత్న బోధన
- ఉపాధ్యాయుల కృషితో గోల్డెన్ పాఠశాలగా గుర్తింపు..

చిన్నచింతకుంట: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారికి విద్యాబోధన చేసేందుకు మండలంలోని గూడూరు గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కంకణం కట్టుకున్నారు. ఇందుకోసం ఒక వినూత్న పద్ధతిని ఎంచుకొని ‘ఎక్స్‌పో’ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీని ద్వారా మార్కులు కాదు.. విద్యార్థుల్లో మార్పే ముఖ్యమనే లక్ష్యంతో అడుగులు వేశారు. దీనికోసం ముందు బ్రెయిన్ బోర్డు ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రవర్తనలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేశారు. తరగతి గదుల్లో, పాఠశాల పరిసరాల్లో 15 వందల ఇంగ్లిష్ పదాలు, వాటికి తెలుగులో వచ్చే అర్థాలు గోడలపై రాయించారు. ప్రతిరోజూ వాటిని విద్యార్థులతో చదివించడంతోపాటు ఇంగ్లిష్‌లో మాట్లాడేందుకు జాలిఫోనిక్స్‌తో కావాల్సిన టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ ద్వారా బోధన చేశారు. విద్యార్థులకు ఇష్టమైన కార్టూన్లను చిత్రీకరించి.. వాటి ద్వారా ఆంగ్ల నిఘంటువులు స్వయంగా వినియోగించే సామర్థ్యాన్ని పెంపొందించారు. ఫలితంగా పాఠశాలకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు వచ్చింది.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం..



మా గ్రామ పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు నాగరాజు, అంజనేయులు చేసిన కృషి అభినందనీయం. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించారు. పాఠశాలకు, మా గ్రామానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చేలా కృషి చేశారు. అందుకు మా గ్రామస్తులంతా ఉపాధ్యాయులకు రుణపడి ఉంటాం.

– కాంతారావు, గ్రామ సర్పంచ్, గూడూర్

గ్రామస్తుల సహకారంతో..



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతోనే నా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాను. గ్రామస్తుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేశాం.

– వై.నాగరాజు, హెచ్‌ఎం, గూడూరు



పాఠశాల గదులపై చిత్రీకరించిన ఇంగ్లిష్ పదాలు

పాఠశాల అభివృద్ధే లక్ష్యంగా..

చిన్నచింతకుంట మండలంలోని మారుమూల ప్రాంతంలో చిన్న పల్లెటూరు గూడూరు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సరైన వసతుల్లేక విద్యార్థులు విద్యనభ్యసించేందుకు ఇబ్బందులు పడేవారు. 2018లో నాగరాజు, ఆంజనేయులు అనే ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీపై గూడూర్ ప్రాథమిక పాఠశాలకు వచ్చారు. ఇక్కడి పరిస్థితి చూసి చలించిపోయారు. ఎలాగైనా పాఠశాలలో మార్పు తీసుకురావాలనే సంకల్పం మొదలైంది. ముందుగా వారి సొంత డబ్బులతో పాఠశాలకు రంగులు అద్దారు. గ్రామస్తుల సహకారంతో పాఠశాలకు కొన్ని వసతులు సమకూర్చారు. వినూత్న కార్యక్రమాలతో విద్యార్థులను ఆకర్షించేలా గదులు మార్చారు. దీంతో పాఠశాలలో 40 మంది విద్యార్థులున్న సంఖ్య 70 మందికి చేరింది. ఫలితంగా రాష్ట్రస్థాయిలో పాఠశాలకు గుర్తింపు వచ్చింది. 2021లో రాష్ట్ర విద్యాశిక్షణ పరిశోధన సంస్థ ప్రచురించిన ‘రైస్‌అండ్ షైన్’ పుస్తకంలో గూడూర్ పాఠశాల విజయగాథకు చోటు దక్కింది. 2023–24కు నాగరాజు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

నిందితులను పట్టుకుంటాం


పెద్దకొత్తపల్లిలో ఏటీఎం షెట్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మనోహర్

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో శనివారం రాత్రి ఇండియన్ 1 ఏటీఎం మిషన్ చోరీకి గురి కావడంతో షెట్టర్‌ను నాగర్‌కర్నూల్ ఎస్పీ మనోహర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చెక్‌పోస్టుల వద్ద ఉన్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి చోరీకి పాల్పడిన వారిని పట్టుకోవాలని సూచించారు. చుట్టు పక్కల ఉన్న షాపుల్లో సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించాలన్నారు.చోరీకి పాల్పడిన వారిని త్వరలో పట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మోహన్ కుమార్, సీఐ యాలాద్రి, ఎస్‌ఐ రాజు, బాలవెంకటరమణ, శేఖర్‌రెడ్డి, సురేష్ ఉన్నారు.

ప్రాణం తీసిన నీటిగుంత


ప్రమాదం జరిగిన నీటిగుంత ఇదే..


ప్రణీత్‌కుమార్ (ఫైల్)

- బహిర్భూమికి వెళ్లి ఏడేళ్ల బాలుడు మృతి
- వనపర్తి జిల్లా పెద్దగూడెంతండా పైగడ్డలో ఘటన

పెబ్బేరు రూరల్/కొత్తకోట రూరల్: ప్రమాదవశాత్తు వ్యవసాయ పొలంలోని నీటిగుంటలో పడి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పెద్దగూడెంతండా పైగడ్డ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లికి చెందిన అలకుంట గోపాలకృష్ణ, వనితలకు యశ్వంత్, ప్రణీత్‌కుమార్(7) ఇద్దరు కుమారులు. కుటుంబ కలహాలతో వనిత రెండేళ్ల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఏడాది క్రితం గోపాల్ మరో పెళ్లి చేసుకుని ఇద్దరు కుమారులతో కలిసి..హైదరాబాద్‌లో డ్రైవింగ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దగ్గరి బంధువుల ఇంట్లో పెళ్లి ఉండడంతో రెండు రోజుల క్రితం అందరూ కలిసి వనపర్తి మండలం పెద్దగూడెంతండా పైగడ్డకు వచ్చారు. ఆదివారం పెళ్లి వేడుకల్లో అందరూ సరదాగా గడిపారు. మంగళవారం హైదరాబాద్‌కు తిరిగి వెళదామనుకున్నా.. భారీ వర్షాల వల్ల ఆగిపోయారు. ప్రణీత్‌కుమార్‌తో పాటు బంధువుల అబ్బాయి వినీత్, ఒక బాలుడు కలిసి మంగళవారం ఉదయం ఇంటికి కొంత దూరంలో ఉన్న వ్యవసాయ పొలంలోని నీటి గుంత వద్దకు బహిర్భూమికి వెళ్లారు. ప్రమాదవశాత్తు ప్రణీత్ అందులో పడిపోయాడు. అతన్ని కాపాడేందుకు మిగిలిన ఇద్దరు ప్రయత్నించినా అప్పటికే నీటిలో మునిగిపోయాడు. వెంటనే ఇంటికి వచ్చిన వినీత్ జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పారు. వారు నీటి గుంత వద్దకు చేరుకొని ప్రణీత్‌ను బయటికి తీసి వనపర్తిలోని ఓ ఆస్పత్రికి తీసుకురాగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి గోపాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని రూరల్ ఎస్‌ఐ నాగన్న తెలిపారు. సాయంత్రం సంకిరెడ్డిపల్లిలో ప్రణీత్ అంత్యక్రియలు నిర్వహించారు.

‘కృష్ణా–వికారాబాద్’కు పచ్చజెండా

నెరవేరనున్న దశాబ్దాల రైల్వేలైన్ కల

- 122 కి.మీ. దూరం.. రూ.2,196 కోట్ల అంచనా
- నిధులు మంజూరు చేసిన కేంద్రం
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు


కోస్గి: దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కృష్ణా–వికారాబాద్ రైల్వేలైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 30 ఏళ్లుగా సర్వేల మీద సర్వేలు చేస్తూ కాలం గడిపారు. రైల్వే బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో.. ఎన్నికల సమయంలో హామీలిచ్చినా ఆచరణ మాత్రం ఆమడ దూరం. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 5,239 కిలోమీటర్లకు పైగా కొత్త రైల్వేలైన్ల నిర్మాణానికి రూ.83,543 కోట్లు మంజూరు చేయడం.. అందులో కృష్ణా–వికారాబాద్ లైన్ ఉంది. మొత్తం 122 కిలోమీటర్ల దూరానికి రూ.2,196 కోట్ల అంచనా వ్యయంతో నిధులు కేటాయించడంపై జిల్లా ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఊరిస్తూ.. దూరమవుతూ...

కృష్ణా–వికారాబాద్ రైల్వేలైన్‌ను 35 ఏళ్ల కిందట ప్రతిపాదించి ఇప్పటి వరకు ఐదు సార్లు సర్వే చేశారు. మక్తల్, ఊట్కూర్, నారాయణపేట, అభంగాపూర్, మద్దూర్, కోస్గి, సర్జఖాన్‌పేట మీదుగా వికారాబాద్ జిల్లాలోని దోమ, పరిగి, వికారాబాద్ వరకు 121.70 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణానికి రూ.680 కోట్లు అవసరమని 2010లో హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ ఏరియల్ డాటా సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అప్పటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ రైల్వే బడ్జెట్ సమావేశంలో ప్రస్తావించినప్పటికీ నిధుల కేటాయింపు మాత్రం జరగలేదు.

నాటి నుంచి ఎన్నికల హామీగానే..

ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హయాంలో రైల్వేశాఖ సహాయమంత్రిగా పని చేసిన పాలమూర్ ఎంపీ మల్లికార్జున్ తొలిసారి సర్వే చేయించారు. 217 కిలోమీటర్లు సర్వే చేసి రూ.87 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇందిరాగాంధీ హత్యానంతరం 1989లో పార్లమెంట్ ఎన్నికల హడావుడి మొదలు కావడం.. పాలమూర్ ఎంపీ స్థానానికి పోటీపడిన జైపాల్‌రెడ్డి, మల్లికార్జున్ ఈ రైల్వేలైన్‌ను ఎన్నికల హామీగా విస్తృత ప్రచారం చేశారు. మల్లికార్జున్ ఎంపీగా గెలిచినప్పటికీ కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ అధికారంలోకి రావడంతో ఆయన చేసిన ప్రయత్నం ఫలించలేదు. అనంతరం పీవీ నర్సింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో మల్లికార్జున్ కేంద్ర రక్షణశాఖ మంత్రిగా ఉండటంతో ఈ రైల్వేలైన్ ఊసే ఎత్తేవారు లేకుండా పోయారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వంలో రైల్వేశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండారు దత్తాత్రేయ ఇచ్చిన హామీ కూడా అలాగే మిగిలి పోయింది


కృష్ణా–వికారాబాద్ రైల్వేలైన్ నమూనా



కథ మొదటికి..


సర్జఖాన్‌పేట శివారులో పాతిన గుర్తింపు రాయి

కొత్త రైల్వే లైన్లు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో కాకుండా రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్లతో చేపట్టాలని అప్పట్లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. 2012లో మరోమారు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని.. నిధుల కేటాయింపే మిగిలిందంటూ దక్షిణమధ్య రైల్వే అధికారులు రైల్వేలైన్ వెళ్లే దారిలో సర్వే చేసి హద్దు రాళ్లను సైతం పాతారు. నిధులు కేటాయించకపోవడంతో నాటి నుంచి నేటి వరకు కేవలం సర్వేలకు మాత్రమే పరిమితమైంది. దేశ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించిన ఎంపీలు మల్లికార్జున్, జైపాల్‌రెడ్డి, విఠల్‌రావుతో పాటు ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక్కడి ప్రజల దశాబ్దాల కల నెరవేర్చక పోవడంతో కలగానే మిగిలింది. మరోమారు ఎన్నికల సమరం మొదలైన నేపథ్యంలో ఈ అంశం తెరమీదకు రావడం.. కేంద్రం ఏకంగా నిధులు మంజూరు చేయడంతో ఆశలు చిగురించాయి. ఈసారైన ఎన్నికల హామీగా కాకుండా కార్యరూపం దాల్చాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

రైల్వేలైన్‌తో మరింత అభివృద్ధి..



రైల్వేలైన్ ఏర్పాటుతో వెనుకబడిన ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి పోటీలో ఉన్నవారు అధికారంలోకి వస్తే కృష్ణా–వికారాబాద్ రైల్వేలైన్ చేపడతామని హామీ ఇవ్వడం.. గెలిచిన తర్వాత సర్వేల పేరుతో కాలయాపన చేయడం 30 సంవత్సరాలుగా కొనసాగుతోంది. ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చేలా కేంద్రం నిధులు మంజూరు చేయడం హర్షణీయం.

– డా. బాల్‌నర్సయ్య, జిల్లా కన్వీనర్, విజ్ఞాన వంతుల వేదిక, కోస్గి

ఎరువుల వాడకంలో జాగ్రత్తలు


పంట పొలంలో ఎరువులు వెదజల్లుతున్న రైతు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: జిల్లాలోని నేలల భూసారాన్ని బట్టి ఈ ప్రాంతంలో డీఏపీని(అడుగు మందు) దుక్కిలోనే వేయాలని శాస్త్రవేత్తలు పేర్కొన్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. ప్రస్తుత సీజన్‌లో డీఏపీని విత్తనాలు విత్తే విధంగానే దుక్కి ఎరువుగా వేసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రైతులు డీఏపీని దుక్కి మందుగా రైతులు కొన్ని పంటలకు మాత్రమే వాడుతున్నారు. ఖరీఫ్ నేపథ్యంలో రైతులు వాడాల్సిన ఆయా రకాల ఎరువులు, వాడాల్సిన మోతాదుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తున్న సూచనలు, సలహాలు ఇలా వివరిస్తున్నారు.

మోతాదుకు మించి డీఏపీ :

ఈ ప్రాంత నేలల్లో భాస్వరం మధ్యస్తంగా, పొటాషియం ఎక్కువగా, నత్రజని తక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఇక్కడి నేల స్వభావాన్ని బట్టి పంట కాలంలో ఎకరానికి 50 కేజీల డీఏపీని వాడాలని శాస్త్రవేత్తలు చెబుతుండగా, రైతులు ఎకరానికి 100 నుంచి 150 కేజీల వరకు అంటే వేయాల్సిన దానికంటే రెండు నుంచి మూడు రెట్లు అధికంగా వేస్తున్నట్లు గుర్తించారు. మరో వైపు ఈ మందును పైపాటుగా వేస్తుండడంతో ఎలాంటి ప్రయోజనం లేకుండాపోతుందని వివరిస్తున్నారు.

వాడే మోతాదు :

భూముల సారాన్ని బట్టి వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎరువుల మోతాదు ఈ విధంగా ఉండాలని పేర్కొంటున్నారు.

- డీఏపీ ఎరువును ప్రతి ఎకరానికి 50 కిలోలు వాడాలి.
- దీన్ని తప్పనిసరిగా దుక్కి ఎరువుగానే వాడాలి.
- డీఏపీలో భాస్వరం ఎక్కువగా ఉన్నందున ఈ ఎరువును పైపాటుగా వేస్తే ఉపయోగకరంగా ఉండదు.
- పత్తి పంటకు విత్తు కంటే మూడు నుంచి నాలుగు అంగుళాల లోతులో డీఏపీ వేయాలి.
- మిగతా అన్ని ఖరీఫ్ పంటలకు ఎకరానికి 50 కేజీలే వాడాలి.
- యూరియా ప్రతి ఎకరానికి వంద కిలోలు వాడాలి.
- ఈ ప్రాంతంలో నత్రజని శాతం తక్కువగా ఉన్నందున యూరియా మోతాదు ఎక్కువగా వాడాలి.
- యూరియాను పైపాటు ఎరువుగా వాడవచ్చు.
- పత్తికి యూరియా పైపాటు ఎరువుగా వాడవచ్చు.
- పత్తి విత్తిన 20 రోజుల నుంచి ఐదుసార్లు వాడాలి.
- వాడిన ప్రతి సారి 30 కేజీల వరకు వేయవచ్చు.
- వరికి యూరియా నాలుగు సార్లు వాడాలి.
- కలుపు తీసే సమయంలో తర్వాత 20 రోజులకు, 30 రోజులకు 50 రోజులకు యూరియాను వరి పైరుకు వాడాల్సి ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

రాజాపూర్: స్కూటీపై వెళ్తున్న యువకులను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం మండలంలోని రంగారెడ్డిగూడ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులు స్కూటీపై రాజాపూర్ నుంచి హైదరాబాద్‌వైపు వెళ్తుండగా రంగారెడ్డిగూడ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ముజంబిల్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు ఖలీల్, సాదిత్‌లకు తీవ్రగాయాలు కావడంతో మొదట షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాబు బంగ్లాకే ముడుపులు..

మళ్లీ ఆ ముగ్గురే

అమరావతి కాంట్రాక్టుల తరహాలోనే 'స్కిల్' స్కామ్.. సూత్రధారి చంద్రబాబే

- 'సీమెన్స్'కి తెలియకుండా ఆ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మాయ
- కాగితాలపై రూ.3,300 కోట్ల ప్రాజెక్టును చూపించి మోసం
- ప్రభుత్వ వాటా పేరుతో డిజైన్ టెక్ కంపెనీకి నిధుల మళ్లింపు
- నకిలీ ఇన్వాయిస్‌లతో డ్రా చేసి పార్థసానికి అందించిన యోగేశ్
- వాటిని హైదరాబాద్‌కు తరలించి చంద్రబాబు పీఎస్‌కు అందించిన పార్థసాని
- ఆ కొల్లగొట్టిన నిధులు చివరకు చేరింది చంద్రబాబు నివాసానికే!
- మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తా, బాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌లకు సిట్ నోటీసులు
- విచారణకు హాజరు కావాలని ముగ్గురికీ ఆదేశం
- 'స్కిల్' కుంభకోణం కేసు దర్యాప్తు వేగవంతం



సాక్షి, అమరావతి: తీగ లాగితే డొంకంతా కదులుతోంది! ముడుపుల చిట్టాలన్నీ చంద్రబాబు బంగ్లాకే దారితీస్తున్నాయి!! అమరావతిలో తాత్కాలిక నిర్మాణాలు, టిడ్కో ఇళ్ల కాంట్రాక్టుల్లో ప్రజాధనాన్ని లూటీ చేసిన వ్యవహారంలో ఆదాయపన్ను (ఐటీ) శాఖ తీగ లాగితే... చంద్రబాబు కనుసన్నల్లో సాగిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్ఎస్‌డీసీ) కుంభకోణం పునాది బయటపడుతోంది. కుంభకోణాలు వేర్వేరైనా కొల్లగొట్టిన ప్రజాధనాన్ని షెల్ కంపెనీల ద్వారా తరలించడంలో పాత్రధారులు మాత్రం వారే. ఆ అక్రమార్జన అంతా చివరకు చేరింది సూత్రధారి చంద్రబాబు చెంతకే అన్నది స్పష్టమవుతోంది. టీడీపీ హయాంలో భవన నిర్మాణ ప్రాజెక్టుల కాంట్రాక్టులను కట్టబెట్టడంలో అక్రమార్జనకు సంబంధించి చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసుల ప్రకంపనలు కొనసాగుతున్నాయి. ఆ కుంభకోణంలో పాత్రధారులుగా ఉన్న మనోజ్ వాసుదేవ్ పార్థసాని, చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, యోగేశ్ గుప్తా ఏపీఎస్ఎస్‌డీసీ అవినీతి బాగోతంలోనూ కీలకంగా వ్యవహరించారని వెల్లడైంది. ఇప్పటికే ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం కేసు దర్యాప్తులో కీలక ప్రగతి సాధించిన సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజా పరిణామాలతో తక్షణం రంగంలోకి దిగింది. ముడుపుల తరలింపులో సూత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ వాసుదేవ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్‌లను విచారించాలని నిర్ణయించింది. ఈమేరకు వారికి నోటీసులు జారీ చేసి దర్యాప్తును వేగవంతం చేసేందుకు సిద్ధమైంది.

బాబు అవినీతి 'స్కిల్'...

టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన సూత్రధారిగా ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం జరిగినట్లు 'సిట్' ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించింది. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి ఏమాత్రం తెలియకుండా ఆ కంపెనీ పేరుతో ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా మోసగించి ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్లు ఆధారాలతో సహా నిరూపించింది. రూ.3,300 కోట్ల ప్రాజెక్టును కాగితాలపై చూపించి సీమెన్స్ కంపెనీ 90 శాతం నిధులు సమకూరుస్తుందని బుకాయించి రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను కేటాయించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. సీమెన్స్ కంపెనీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే ప్రభుత్వ వాటా 10 శాతం కింద జీఎస్టీతో కలిపి మొత్తం రూ.371 కోట్లను అడ్డగోలుగా చెల్లించేశారు. అలా నిధులు చెల్లించడం నిబంధనలకు విరుద్ధమని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావుతోపాటు మరో ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులు వారించినా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఖాతరు చేయలేదు. ఏకపక్షంగా రూ.371 కోట్లను సీమెన్స్ భాగస్వామ కంపెనీగా ఒప్పందంలో చూపించిన డిజైన్ టెక్ కంపెనీకి విడుదల చేశారు. అందులో రూ.241 కోట్లను పలు షెల్ కంపెనీలను సృష్టించి హవాలా మార్గంలో టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యనేత కొల్లగొట్టారు. ఈ కేసులో సిట్ అధికారులు 8 మందిని అరెస్టు చేశారు. హవాలా మార్గంలో నల్లధనాన్ని చలామణిలోకి తెచ్చినందున కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ కూడా రంగంలోకి దిగింది. మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని నిర్ధారించి ఈ కేసులో నలుగురిని అరెస్టు చేయడంతోపాటు డిజైన్ టెక్ కంపెనీకి చెందిన రూ.31.20 కోట్లను అటాచ్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

షెల్ కంపెనీలు.. బోగస్ ఇన్వాయిస్‌లు

టీడీపీ ప్రభుత్వంలో అమరావతిలో తాత్కాలిక నిర్మాణాల కాంట్రాక్టులను కట్టబెట్టిన కుంభకోణంలో పాత్రధారులుగా ఉన్నవారే ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలోనూ కీలకపాత్ర పోషించారని సిట్ గుర్తించింది. షాపూర్జీ- పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా, చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్.. ఈ ముగ్గురూ అమరావతి భవన నిర్మాణాల కాంట్రాక్టు అవినీతి సొమ్మును చంద్రబాబుకు చేర్చడంతో కీలకంగా వ్యవహరించారన్నది ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. రూ.8 వేల కోట్ల విలువైన నిర్మాణాల కాంట్రాక్టుల్లో భారీ అవినీతికి పాల్పడి ఆ నల్లధనాన్ని మనోజ్ వాసుదేవ్ పార్థసాని షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు చేర్చారు. అందుకోసం షెల్ కంపెనీలను సృష్టించడంలో యోగేశ్ గుప్తా కీలక పాత్ర పోషించారు. ఆయన నివాసంలో ఐటీ శాఖ అధికారులు సోదాలు కూడా నిర్వహించారు. మరోవైపు ఆ షెల్ కంపెనీల పేరుతో మళ్లించిన నిధులను డ్రా చేసి మనోజ్ వాసుదేవ్ పార్థసాని నగదు రూపంలో చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో అందించారు. ఆ విధంగా చంద్రబాబుకు చేరిన అక్రమార్జనలో రూ.118 కోట్లకు సంబంధించి లెక్కలు చెప్పాలని ఐటీ శాఖ నోటీసులు జారీ చేయడం జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

బాబుకు ముడుపులు చేరాయిలా..

అమరావతిలో తాత్కాలిక నిర్మాణ కాంట్రాక్టుల అవినీతి దందాలో సూత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్ ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో ప్రధాన భూమిక పోషించిన తీరు ఇదీ..

- ఏపీఎస్ఎస్‌డీసీ నిధులను కొల్లగొట్టేందుకు యోగేశ్ గుప్తా పలు షెల్ కంపెనీలను సృష్టించాడు. ముంబై, పుణే కేంద్రాలుగా సృష్టించిన షెల్ కంపెనీల పేరిట నకిలీ ఇన్వాయిస్‌లను సమర్పించారు. ఆ ఇన్వాయిస్‌ల ఆధారంగా షెల్ కంపెనీలకు ఏపీఎస్ఎస్‌డీసీ రూ.371 కోట్లను విడుదల చేసింది. దీనిపై ఆధారాలు సేకరించిన అనంతరం సిట్ అధికారులు ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో కేసులో యోగేశ్ గుప్తాను ఏ-22గా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు.
- నకిలీ ఇన్వాయిస్‌ల ఆధారంగా షెల్ కంపెనీలకు చేరిన రూ.371 కోట్లను యోగేశ్ గుప్తా డ్రా చేసి మనోజ్ పార్థసానికి అందించాడు. ఆయన అందులో రూ.241 కోట్లను ముంబై నుంచి హైదరాబాద్‌కు తరలించాడు. రూ.241 కోట్ల నగదు మొత్తాన్ని హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించాడు.
- ఆ రూ.241 కోట్ల నగదు మొత్తం పెండ్యాల శ్రీనివాస్ ద్వారా చివరకు హైదరాబాద్‌లో చంద్రబాబు నివాసానికి చేరినట్లు స్పష్టమవుతోంది.

ఆ ముగ్గురికీ సిట్ నోటీసులు

ఏపీఎస్ఎస్‌డీసీ నిధులను కొల్లగొట్టడంతో పాత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్‌లకు సిట్ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేశారు. వచ్చే సోమవారం విజయవాడలో సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరు కావాలని యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసానికి నోటీసులిచ్చారు. చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ ఈనెల 14న విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు.

'గోవింద కోటి' రాసిన వారికి బ్రేక్ దర్శనం



బోర్డు సభ్యులతో చైర్మన్ భూమన

- విద్యార్థులకు కోటి భగవద్గీత పుస్తకాల పంపిణీ
- సనాతన ధర్మం అనేది మతం కాదు.. అదొక జీవనయానం
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుమల: యువతలో హైందవ సనాతన ధర్మ వ్యాప్తి కోసం శ్రీవారి ఆలయం నుంచే తొలి అడుగు వేస్తున్నామని, ఇందులో భాగంగా రామకోటి తరహాలో గోవింద కోటి రాసిన 25 ఏళ్ల లోపు వారికి వారి కుటుంబ సభ్యులతో కలిసి ఒకసారి తిరుమల స్వామివారి బ్రేక్ దర్శనం కల్పిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పారు. 10 లక్షల 1,116 సార్లు గోవింద నామం రాసిన వారికి దర్శన సౌభాగ్యం కల్పిస్తామన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం ధర్మకర్తల మండలి తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ మీడియాకు వివరించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా 20 పేజీల్లో భగవద్గీత సారాంశాన్ని పుస్తక ప్రసాదంగా కోటి పుస్తకాలు ముద్రించి పంపిణీ చేస్తామని చెప్పారు. ఇటీవల చిరుత దాడిలో మృతి చెందిన చిన్నారి లక్షిత కుటుంబానికి టీటీడీ ద్వారా గతంలో ప్రకటించిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ముంబైలోని బాంద్రాలో రూ.1.65 కోట్లతో శ్రీవారి రెండో ఆలయం, రూ.5.35 కోట్లతో సమాచార కేంద్రాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని టీటీడీ బోర్డు సభ్యులు విరాళంగా అందిస్తారన్నారు. రూ.33 కోట్లతో వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాల కోసం కేటాయించిన స్థలంలో రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని, ఈ మొత్తాన్ని ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారన్నారు. రూ.600 కోట్లతో తిరుపతి రైల్వేస్టేషన్ వెనుక వైపు ఉన్న 2,3 సత్రాల స్థానంలో అచ్యుతం, శ్రీపథం వసతి సముదాయాలను నిర్మించనున్నట్లు తెలిపారు. టీటీడీ ఆలయాల్లో 413 పోస్టుల మంజూరు కోసం ప్రభుత్వానికి విన్నవించనున్నట్లు చెప్పారు. తిరుపతిలో నిర్మాణం కానున్న శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో 300 మందిని నియమించనున్నట్లు చెప్పారు. టీటీడీ ఆధ్వర్యంలోని ధర్మగిరి, కీసరగుట్ట, విజయనగరం, ఐ.భీమవరం, కోటప్పకొండ, తెలంగాణలోని నల్లగొండ వేద విజ్ఞాన పీఠాలకు సంబంధించి అదనంగా 47 అధ్యాపక పోస్టులను మంజూరు చేసినట్లు చెప్పారు.

ఉదయనిధి మాటలను ఖండిస్తున్నాం

సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన విమర్శలను భూమన ఖండించారు. సనాతన ధర్మం మతం కాదని, అదొక జీవనయానమని చెప్పారు. ఈ విషయం తెలియక సనాతన ధర్మానికి కులాలను ఆపాదించి విమర్శలు చేస్తే సమాజంలో అలజడి చెలరేగే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది విమర్శకులకు కూడా మంచిది కాదన్నారు.

బీసీ బిల్లు, మహిళా బిల్లు ప్రవేశపెట్టాలి

- ఈనెల 21న చలో ఢిల్లీకి పిలుపునిచ్చిన ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీ బిల్లు, మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవం సందర్భంగా దేశంలో జరిగిన అభివృద్ధి గురించి పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు కేంద్రమంత్రులు ప్రకటించారన్నారు. అయితే 76 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత ఈ దేశంలోని 56 శాతం జనాభా గల బీసీ కులాల బతుకులు ఎలా బాగుపడ్డాయో, బాగుపడటానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారో కూడా పార్లమెంట్‌లో చర్చ జరగాలని కృష్ణయ్య కోరారు. ఈ మేరకు ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీ బిల్లు, మహిళా బిల్లులో మహిళలకు సబ్ కోటా కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 21న చలో ఢిల్లీకి పిలుపునిచ్చారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళా బిల్లుకు సార్థకత లేదని కృష్ణయ్య తెలిపారు. మహిళా బిల్లు గురించి గొంతులు చించుకుని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బీసీ మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.



రక్తంతో సర్వేపల్లి చిత్రం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని చిన్నపొర్ల ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్ట్ టీచర్ కె.లక్ష్మణ్ తన రక్తంతో డాక్టర్‌సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రాన్ని గీసి తన అభిమానాన్ని చాటుకున్నాడు. ఉపాధ్యాయులకు సర్వేపల్లి ఆదర్శమని, ఆయన అడుగుజాడల్లో నడిచి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు.

– ఊట్కూర్

సైబర్ మోసం : కేసు నమోదు

గోపాల్‌పేట: రేవల్లి మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సైబర్ క్రైం కేసు నమోదైనట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బందరావిపాకుల గ్రామానికి చెందిన బంగారయ్యకు ఈ ఏడాది జనవరిలో ఎస్‌బీఐ నుంచి క్రెడిట్ కార్డు వచ్చింది. దీనికి లక్ష రూపాయల వరకు లిమిట్ ఉంది. బంగారయ్య క్రెడిట్ కార్డులో రూ.60 వేలు వాడుకున్నాడు. దీంతో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ నుంచి ఫోన్ చేస్తున్నామని అతనికి కాల్ వచ్చింది. తాను వాడుకున్న రూ.60వేలకు వడ్డీ తగ్గిస్తామని నమ్మబలికారు. అతని ఆధార్ కార్డు, బ్యాంక్ వివరాలు చెప్పించుకున్నారు. అనంతరం ఫోన్‌లో ఎనీ డెస్క్‌యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. తర్వాత ఫోన్ పే యాప్ ఓపెన్ చేయించి బ్యాంకులో ఉన్న పర్సనల్ డబ్బు రూ.37,072 కొట్టేశారు. కొంతసేపటి తర్వాత బంగారయ్య బ్యాంక్ బ్యాలెన్స్ చెక్ చేసుకుంటే జీరో బ్యాలెన్స్ చూపించింది. దీంతో మోసపోయిన అతను 1930 (ఎన్‌సీఆర్) టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. తర్వాత రేవల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

32 నుంచి 16వ స్థానంలోకి..



మహబూబ్‌నగర్‌లో న్యూట్రీషియన్ కిట్ అందిస్తున్న వైద్యాధికారులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగిన ప్రసవాలు

- రాష్ట్ర స్థాయిలో మెరుగైన జిల్లా ర్యాంకు
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 6,454 ప్రసవాలు

పాలమూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచుతూ వైద్యులు జిల్లా స్థానం మెరుగుపరిచారు. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు జిల్లా ర్యాంకుల్లో మార్పు చోటు చోటు చేసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలలో జూన్‌లో 68 శాతం, జూలై నాటికి 71 శాతం పెరిగింది. ఆగస్టులో 73 శాతం ప్రసవాలు పెరగడంతో రాష్ట్రంలో 16వ స్థానానికి ఎగబాకింది. మూడు నెలల కిందట ప్రసవాల అంశంలో జిల్లా 32వ స్థానంలో ఉండగా కేవలం మూడు నెలల వ్యవధిలో చాలా వరకు పురోగతి సాధించింది. సీ–సెక్షన్(ఆపరేషన్) కాన్పుల విషయంలో ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేట్‌లనూ తగ్గుతూ వస్తోంది. జూన్‌లో 52 శాతం అయితే జూలైలో 42 శాతానికి తగ్గింది. ఆగస్టులో మళ్లీ 48 శాతం ఆపరేషన్ ద్వారా కాన్పులు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యధికంగా ప్రసవాలు అవుతున్న జిల్లాల్లో గద్వాల 2వ స్థానం, నాగర్‌కర్నూల్ 5వ స్థానం, మహబూబ్‌నగర్ 16వ స్థానం, వనపర్తి 20వ స్థానం, నారాయణపేట 31వ స్థానంలో ఉన్నాయి.

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాల వివరాలు

నెల	ప్రభుత్వ	ప్రైవేట్	మొత్తం
జనవరి	903	422	1,325
ఫిబ్రవరి	820	385	1,205
మార్చి	1,004	484	1,488
ఏప్రిల్	937	424	1361
మే	882	389	1,271
జూన్	890	364	1,254
జూలై	1,057	330	1,387
ఆగస్టు	1,011	244	1,255

మెరుగైన వసతులు..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరగడానికి ప్రధాన కారణం పరిశీలిస్తే కేసీఆర్ కిట్, న్యూట్రీషియన్ కిట్‌లతో పాటు ఇతర ప్రాంతాల నుంచి జనరల్ ఆస్పత్రికి తీసుకురావడానికి 102 సౌకర్యం ఉండటం . జూన్ 14నుంచి న్యూట్రీషియన్ కిట్ల పంపిణీ ప్రారంభం చేసిన తర్వాత మరింత పెరిగింది. ముఖ్యంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం, అవసరమైన వసతులు పెరగడం వల్ల చాలా వరకు ప్రసవాలకు ఇక్కడి వస్తున్నారు.

7,363 మంది గర్భిణులు నమోదు

జిల్లాలో 7,363మంది గర్భిణులు నమోదు చేసుకోగా, ఇందులో హైరిస్క్ కేసులు 2,454 ఉన్నాయి. జిల్లాలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్‌లలో 2,572 సాధారణ కాన్పులు, 2169 సిజేరియన్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 4,741కాన్పులు అయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు 586, సిజేరియన్ 1,127 ప్రసవాలు అయ్యాయి.

ప్రసవాల సంఖ్య పెంచుతాం..



జిల్లాలో ప్రసవాలపై మెడికల్ ఆఫీసర్లు, ఇతర అధికారులతో సమీక్ష చేయడం, రిజిస్ట్రేషన్ విధానం, చెకప్, 102 సర్వీస్‌తో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు పెరగడం వల్ల కాన్పులు సంఖ్య పెరిగింది. ప్రధానంగా టీ–హాబ్‌లో అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేయడం, కేసీఆర్ కిట్, న్యూట్రీషియన్ కిట్లు ఇవ్వడం వల్ల గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇంకా ప్రసవాలు సంఖ్య పెరిగే విధంగా చూస్తాం.

– కృష్ణ, డీఎంహెచ్‌ఓ, మహబూబ్‌నగర్

పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ



హన్వాడ: చిన్నదర్పల్లి శివారులోని శ్రీలక్ష్మీగోశాల స్టేజీ సమీపంలో తాండూర్ నుంచి కర్నూల్ వెళ్తున్న బండల లోడ్ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లింది. ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నట్లు చుట్టుపక్కల పొలాల వారు పేర్కొన్నారు. రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టి వరిపొలంలోకి వెళ్లి బురదలో కూరుకుపోయిందన్నారు. డ్రైవర్, క్లీనర్లు ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారని వివరించారు.

సుపారీ వదంతుల కలకలం

కల్వకుర్తి: డివిజన్ పరిధిలోని ఊర్కొండ మండలం మాధారం గ్రామంలో ఇద్దరు వ్యక్తులను హతమార్చేందుకు సుపారీ ఇచ్చారన్న వదంతులపై ఇద్దరికి పోలీసులు 41 సీఆర్‌పీసీ నోటీసులు మంగళవారం అందజేశారు. ఊర్కొండ ఎస్ఐ లెనిన్ కథనం ప్రకారం.. మాధారం గ్రామానికి చెందిన ద్యాప మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డిలకు సంబంధించిన వ్యవసాయ పొలం 48.16 ఎకరాలకు సంబంధించి గ్రామ సర్పంచ్ నిఖిల్‌రెడ్డి బెదిరించారని సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును విచారించగా నిఖిల్‌రెడ్డితో పాటు మరో వ్యక్తి కంఠం విజయ్ కలిసి ఫారుఖ్ అనే వ్యక్తికి సుపారీ ఇచ్చారని మాట్లాడిన విషయమై వారిద్దరిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అనంతరం వారిద్దరికి నోటీసులు అందించి, విచారణకు ఎప్పుడు పిలిచినా అందుబాటులో ఉండాలని సూచించి ఇంటికి పంపించారు.

నేతల పరామర్శ

పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నిఖిల్‌రెడ్డిని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, టీపీసీసీ అధికార ప్రతినిధి అనిరుధ్‌రెడ్డి కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో పరామర్శించారు. కేసుకు సంబంధించిన వివరాలను ఇరువురు నేతలు డీఎస్పీ పార్థసారధిని అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ నిఖిల్‌రెడ్డి అరెస్టుతో గ్రామస్తులు పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఊర్కొండ మండలం జడ్చర్ల నియోజకవర్గంలో ఉండటంతో అక్కడి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కల్వకుర్తి పోలీసులతో ఫోన్‌లో మాట్లాడి కేసుకు సంబంధించిన వివరాలపై ఆరాతీశారని సమాచారం. మాధారం సర్పంచ్ నిఖిల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి సంబంధించి నియోజకవర్గంలో కీలక నేత కావడంతో అధికార పక్షం కావాలని లేనిపోని కేసులతో ఇబ్బంది పెట్టడం సమంజసం కాదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఇది కక్షసాధింపు చర్యలో భాగమేనని మండిపడుతున్నారు.

జూరాలకు మళ్లీ వరద



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం

- 40వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 4 యూనిట్లలో విద్యుదుత్పత్తి ప్రారంభం

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువన కురుస్తున్న వర్షాల ఆధారంగా వరద మళ్లీ ప్రారంభమైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రాజెక్టుకు 10వేల క్యూసెక్కుల వరద ప్రారంభమై , సాయంత్రాని 40వేల క్యూసెక్కులకు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. 10 రోజులుగా ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి జూరాల కుడి, ఎడమ కాల్వలతో పాటు ఇతర అవసరాలకు నీటిని వినియోగించడంతో రిజర్వాయర్‌లో నీటిమట్టం 5 టీఎంసీలకు పడిపోయింది. ప్రస్తుతం ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లోతో రిజర్వాయర్ నీటి మట్టాన్ని నింపుతున్నారు. మొత్తం నాలుగు యూనిట్లలో విద్యుదుత్పత్తి ప్రారంభించారు. ఎగువలో 2 యూనిట్ల ద్వారా 78 మెగావాట్లు, దిగువలో 2 యూనిట్ల ద్వారా 80 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఇందుకోసం 15వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు.

ప్రాజెక్టు నీటి మట్టం 9 టీఎంసీలకు చేరాక వరద నీటిని జల విద్యుత్ కేంద్రం ద్వారా దిగువకు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. అర్ధరాత్రి లేదా బుధవారం ఉదయం క్రస్టు గేట్లను తెరిచే అవకాశం ఉందని పీజేపీ అధికారులు పేర్కొన్నారు. ఆవిరి రూపంలో 52 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 15,367 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 7.334 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

జూరాల ఎడమ కాల్వ నీరు నిలిపివేత..

మదనాపురం: మండల పరిధిలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ నీటిని నిలిపేశారు. సమాంతర కాల్వ ద్వారా 175 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వ్యవసాయ అవసరాలకు ఎన్టీఆర్ కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, కుడి, ఎడమ, కాల్వల ద్వారా 10 క్యూసెక్కులు, రాజీవ్ బీమా ఫేస్ టు ద్వారా 854 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్ రెడ్డి తెలిపారు.

శ్రీశైలంలో నీటిమట్టం 850.6 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం 850.6 అడుగుల నీటిమట్టం, 81.4594 టీఎంసీల నీటి నిల్వ ఉంది. హంద్రీ నుంచి 183 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తోంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2,000, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,230, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. స్థానికంగా 2.20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నీటిశుద్ధి కేంద్రాన్ని తరలించండి

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని మూసివేయడం లేదా అక్కడి నుంచి ఇతర ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని లోకాయుక్త కలెక్టర్, తదితర అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసేందుకు గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి తమ వ్యవసాయ పొలంలో నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, నీటిశుద్ధి అనంతరం విడుదలయ్యే నీరు సమీపంలోని రంగనాయకుల చెరువులోకి వెళ్లడం వల్ల చెరువులోని చేపలు, తదితర మూగజీవాలకు హాని కలుగుతోంది. దీంతో గ్రామానికి చెందిన నాగోజీ, తదితరులు లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో గతనెల 18న ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు మంగళవారం వెలుగులోకి వచ్చాయి. లోకాయుక్త కలెక్టర్‌తో పాటు పర్యావరణ శాఖ ఈఈ, ఆర్డీఓ, డీపీఓ, గ్రామ సర్పంచ్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. నీటిశుద్ధి కేంద్రం ఏర్పాటు నుంచి వివాదం నెలకొంది. పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు లోకాయుక్తకు సైతం ఫిర్యాదు చేశారు.